ప్రజాశక్తి
గురువారం 1 ఆగస్టు 2024 5
శ్రీ సత్యసాయి





ఓడీసీ తహశీల్దార్‌కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

తొలిపర్యటనలో హామీలేమిస్తారో..!

- నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర పర్యటన
- పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


సార్వత్రిక ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా సత్యసాయి జిల్లాకు విచ్చేయనున్నారు. గురువారం మధ్యాహ్నం మడకశిర మండలం గుండుమలలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలోనూ పాల్గొంటారు. బహిరంగ సభలేవీ లేకుండానే మొదటి పర్యటన ముగియనుంది. తొలిసారిగా ఇక్కడికి విచ్చేస్తున్న ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లా సమస్యలపై ఎటువంటి హామీలివ్వనున్నారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల సమయంలో జరిపిన పర్యటనలో అభివృద్ధి అంశాలను ఆయన లేవనెత్తారు. ఈ అంశాలపై తొలి పర్యటనలో ఏమైనా ప్రకటనలు చేస్తారా అని ఉమ్మడి జిల్లావాసులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా సాగునీటి రంగం గడిచిన ఐదేళ్లలో పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామన్న హామీ ప్రకటనలకే పరిమితమైంది. ముఖ్యమంత్రి ఇప్పుడు పర్యటిస్తున్న మడకశిరకు హంద్రీనీవా నీళ్లు ఇవ్వాల్సి ఉంది. ఈ పనులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. ఈ పర్యటన సందర్భంగా హంద్రీనీవా నీళ్లను మడకశిరకు అందించే అంశంపై ఏ రకంగా స్పందిస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఇక మడకశిర ప్రాంతంలోనే పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసమని రాళ్ల అనంతపురం వద్ద భూమి సేకరణ చేశారు. ఇప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పన జరగలేదు. ఇక్కడికి కొత్త పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూసిన దాఖలాలూ లేవు. దీంతో మడకశిర ప్రాంతంలోని నిరుద్యోగ యువత, సామాన్యులు కూడా ఉపాధి కోసం కర్నాటక ప్రాంతానికి నిత్యం వలసలు వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన ఈ ప్రాంతంలో లెదర్ పార్కును ఏర్పాటు చేస్తామన్న హామీ కూడా దశాబ్ధాలుగా పెండింగ్‌లోనే ఉంది. ఇక తాగునీటికి ఇబ్బందులు నెలకొన్నాయి. పనులు కొన్ని మంజూరైన గడిచిన ఐదేళ్లలో పూర్తి స్థాయిలో చేపట్టలేదు. కర్నాటక సరిహద్దుల్లో ఉన్న మడకశిర ప్రాంతం ఎంతో వెనుకబడి ఉంది. ఈ ప్రాంతాభివృద్ధి కొత్త ప్రాజెక్టులేమైనా ప్రకటిస్తారా లేదా అని ఈ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా

గురువారం ఉదయం నంద్యాల జిల్లాలో పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 12.20 గంటలకు హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మడకశిరకు మధ్యాహ్నం 1.45 గంటలకు చేరుకుంటారు. పాలిటెక్నికల్ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగిన తరువాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గుండుమలకు చేరుకుంటారు. గుండుమలలో వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడే గ్రామస్తులతో మాట్లాడుతారు. అనంతరం కరియమ్మ దేవస్థానం సందర్శిస్తారు. అనంతరం తిరుగు ప్రయాణమై సాయంత్రం 4.30 గంటలకు హెలిక్యాప్టర్‌లో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరానికి తిరుగు ప్రయాణమై వెళ్తారు.



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చస్తున్న మంత్రి కేశవ్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, కలెక్టర్ చేతన్



హంగూ.. ఆర్భాటం లేకుండా ముఖాముఖి..

మడకశిర : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మడకశిర పర్యటను హంగూ..ఆర్భాటం లేకుండా జరగనుందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. బుధవారం నాడు వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఎలాంటి బహిరంగ సభా లేదన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎల్ఈడీ టీవీల ద్వారా కార్యక్రమాన్ని వీక్షించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా అధికారులు ఎక్కడా పరదాలు కట్టరాదన్నారు. ప్రజా వేదిక ద్వారా సామాన్య ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. గుండుమల పంచాయతీ ప్రజలు మాత్రమే ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమం ప్రజా వేదికపై మాట్లాడే విధంగా ఏర్పాట్లను అధికారులు చేశారన్నారు.

అంగన్‌వాడీల జోలికొస్తే ఊరుకోం

- రాజకీయ వేధింపులను తక్షణం ఆపాలి
- అంగన్‌వాడీ వర్కర్ నాగమణికి న్యాయం చేయాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రభుత్వాలు మారాయన్న సాకుతో అంగన్‌వాడీలను ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ రాజకీయ వేధింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకోం అంటూ సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు హెచ్చరించారు. ఓబుళదేవరచెరువు మండలం వీరప్పగారిపల్లి గ్రామానికి చెందిన అంగనవాడీ వర్కర్ నాగమణి ఆత్మహత్యాయత్నంకు కారణమైన టిడిపి నాయకులు ఆంజనేయులు, అతని తమ్ముడు వెంకటేష్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆందోళన కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులుతో పాటు ఓబుళదేవరచెరువు, నల్లమాడ, అమడగూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఓబుళదేవరచెరువు మండలం వీరప్పగారిపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆంజినేయులు, అతని తమ్ముడు వెంకటేష్‌లు నిత్యం బెదిరిస్తూ వేధింపులకు దిగారన్నారు. దీనిని తట్టుకోలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిందన్నారు. విధి నిర్వహణలో నాగమణి బాగా పని చేస్తోందని గ్రామానికి చెందిన గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు చెబుతున్నా అకారణంగా టిడిపి నాయకులు ఆమెపై నిందలు మోపారన్నారు. ఆంజనేయులు అధికార పార్టీ నేతనంటూ తాను చెప్పినట్లు వినాలంటూ నిత్యం భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. మరో సెంటర్‌లో పని చేస్తున్న మినీ కార్యకర్త సుహాసిని బాయిని సైతం రాత్రి వెంబడించి కొట్టారన్నారు. ఆమె మొబైల్‌ను కూడా లాక్కుని దౌర్జన్యం చేశారన్నారు. గ్రామంలో టిడిపి నాయకుడు ఆంజనేయులు, వారి కుటుంబ సభ్యుల అరాచకం ఎక్కువైందన్నారు. అధికారులు, పోలీసులు వెంటనే స్పందించి అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పార్టీలు మారిన ప్రతిసారీ అంగన్‌వాడీ కార్యకర్తలను మార్చాలని ఆలోచన సరైనది కాదన్నారు. ఇలాంటి చర్యలను రాజకీయ పార్టీలు మానుకోవాలన్నారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు ఇలాగే కొనసాగితే జిల్లాలో ఉన్న వేలాది మంది అంగన్వాడీ కార్యకర్తలతో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. నాగమణికు న్యాయం చేయకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ జాకీర్ హుస్సేన్‌కు అందజేశారు. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబ శివ, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి రంగమ్మ, అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ, మణిమాల, కోశాధికారి కృష్ణమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ యంత్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కదిరి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ యంత్రాలను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కాలంలో చాలామందికిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. కిడ్నీ బాధిత రోగులను ఆదుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. అలాగే ఎఆర్‌టి సెంటర్‌లో హెచ్‌ఐవి వైరస్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన నూతన మిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌ఒ డాక్టర్ తిపేంద్ర నాయక్ , హాస్పటల్ సూపరింటెండెంట్ హుస్సేన్, వైద్యులు, టిడిపి నాయకులు పవన్ కుమార్ రెడ్డి, సామాల కేశవరెడ్డి, షేక్ సమీవుల్లా, ఇర్ఫాన్, చెన్నకేశవులు, బహువుద్దీన్, హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యూఎస్ అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఇ మల్లికార్జున, ద్వామా పిడి విజయేంద్ర ప్రసాద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి తాగునీరు ఇచ్చేలా ప్రత్యేక స్కీం తయారు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్యతో పాటు పని దినాలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, ద్వామా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు పేదలకే దక్కాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రభుత్వం ఎన్నికల ముందు హడావుడిగా తెచ్చిన జీవో నెంబర్ 596 భూ చట్ట సవరణ ఉత్తర్వులు దళిత గిరిజనుల అసైన్డ్ భూములను భూస్వాములు కొనుగోలు పేరుతో కబ్జా చేసేందుకు తోడ్పడ్డాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. భూ చట్ట సవరణ ప్రకారం 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు శాశ్వత భూ హక్కు కల్పిస్తామని గత ప్రభుత్వ నేతలు చెప్పారన్నారు. అసైన్డ్ భూములను సాగు చేసుకోవాల్సిన దళిత, గిరిజనులను భూముల నుండి తరిమేసేందుకు ఈ చట్ట సవరణ రాజకీయ నాయకులకు ఉపయోగపడిందని విమర్శించారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్నికల ముందు మూడు నెలల కాలంలో 7500 ఎకరాలు అసైన్డ్ భూముల్ని రిజిస్టర్ పేరుతో నిరుపేదలైన దళిత గిరిజన బలహీన వర్గాల వారి నుండి భూస్వాముల చేతుల్లోకి మారాయని అన్నారు. ఇప్పటికే వేలాది ఎకరాలు భూములు గ్రామీణ ప్రాంతాల్లో దళిత , గిరిజనుల నుంచి అక్రమంగా దౌర్జన్యంగా పెత్తందార్ల స్వాధీనం చేసుకున్నారని విమర్శించారు. ఈ అక్రమాలను మరింత భద్రపరచుకోవడానికి గత సంవత్సరం చివర్లో వైసీపీ ప్రభుత్వం జీవో తెచ్చిందని ఈ జీవోను ఉపసంహరించాలని సిపిఎం ఆధ్వర్యంలో అప్పట్లోనే ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. భూ చట్ట సవరణను ఉపయోగించుకుని జిల్లాలోని అసైన్డ్ భూములను నాటి అధికార పార్టీ నాయకులు, గ్రామ పెత్తందార్లు తమ పేర్ల మీదకు మార్చుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

అక్రమాలకు పాల్పడిన వారి పేర్లు బహిరంగంగా ప్రకటించి కఠినంగా శిక్షించాలని కోరారు. అన్యాక్రాంతం అయిన భూములు తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేతనాలు ఇప్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లకు 10 నెలల బకాయి వేతనాలు ఇప్పించాలని క్లాప్ డ్రైవర్లు కోరారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజను కలిసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. తమకు సకాలంలో వేతనాలు ఇవ్వక పోవడంతో వాహనాలను నిలిపి ఇతర పనులకు పోతున్నాము. అయితే గత రెండు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ వేతనాలు అందే విధంగా చూస్తామని చెప్పడంతో తాము విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. గత వేతనాలతో పాటు ప్రస్తుతం పని చేసిన వేతేనాలు సైతం తమకు ఇవ్వలేదన్నారు. దీంతో జీవనం కష్టంగ మారిందన్నారు. తమ వేతనాలను ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ ఇంద్రజ సంబందింత గుమాస్తాను పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి వేతనాలు అందే విధంగా చూస్తామని వారికి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లాప్ డ్రైవర్లు పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న క్లాప్ డ్రైవర్లు


ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జీవితంలో ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈనేపథ్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పల్లె మాట్లాడుతూ సమాజంలో గురువుకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అన్ని వృత్తుల్లో కంటే ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవమైన స్థానం దక్కుతుందన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధ్యాయునికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎంపీపీ ఎవి. రమణారెడ్డి, ఎంఇఒ ప్రసాద్, రిటైర్డ్ ఎంఇఒలు సుబ్రహ్మణ్యం, భాస్కర్ రెడ్డి, ఉన్నత పాఠశాల సిబ్బంది, తెలుగుదేశం నాయకులు రామాంజనేయులు, విజయ్ కుమార్, శ్రీరామ్ నాయక్, శ్రీరామ్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎలకు ఎన్నికల అలవెన్సు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - కొత్తచెరువు



వినతిపత్రం అందజేస్తున్న విఆర్ఎలు

పుట్టపర్తి నియోజకవర్గంలోనే 6 మండలాల్లో సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వర్తించిన విఆర్ఎలకు టిఎ, డిఎ డబ్బులు ఇవ్వాలని విఆర్ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న కోరారు. ఈ మేరకు ఆయన విఆర్ఎలతో కలసి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అధికారి ఉదయ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ ఎన్నికలు పూర్తి అయి రెండు నెలలు అయినప్పటికీ తమకు డబ్బులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు తక్షణమే డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎలు శివ, సాయి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మఠం భూముల్లో పేదలకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

బత్తలపల్లిలోని 401 సర్వేనెంబరులోగల నిడిమామిడి మఠం భూమిలో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రాష్ట్ర నాయకులు జింకాచలపతి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, పేదలు బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారిణి లక్ష్మీదేవికి వినతిపత్రం ఆందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రవికుమార్, రమణ. చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ. నాయకులు వెంకటస్వామి, బతలపల్లి సీపీఐ నాయకులు వెంకటేశ్, రైతుసంఘం సహాయకార్యదర్శి కుళ్లాయప్ప, శ్రీధర్, ఆదినారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాగుభూమి ఇవ్వాలి

కదిరి టౌన్ : భూమిలేని నిరుపేదలకు అభ్యంతరం లేని ప్రభుత్వ(అసైన్మెంట్) భూమి 3 ఎకరాలు ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ జిల్లా నాయకులు కదిరిప్ప డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వెనుకబడిన ఎస్సీ వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి అసైన్మెంట్ సాగుభూములు ఇవ్వడం జరిగిందన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర బుధవారం తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటగది, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. చిన్నపిల్లల ఆరోగ్యం దృష్ట్యా వాటిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. సత్యసాయిబాబా ఈ పాఠశాలలో ఎనిమిదవ తరగతిలో పేరు నమోదు చేసుకున్న పుస్తకాన్ని ఈసందర్భంగా ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

గాండ్లపెంట : రైతులు ఉద్యాన పంటల సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని కట్టారుపల్లి క్రాస్ వద్ద బుధవారం రెడ్స్ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలసాగుతో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. నల్లమాడ మండలంలో రెడ్స్ సంస్థ భానుజా పండ్ల మొక్కలను ప్రతి రైతుకు అందజేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి విద్యాసంస్థ అధినేత పవన్ కుమార్ రెడ్డి, దాసిరెడ్డి కేశవరెడ్డి, తుంగ వేణుగోపాల్ రెడ్డి, చిన్నోడు, రైతులు తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల హెల్త్ కార్డు ప్రీమియం చెల్లిస్తాం : ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి నియోజకవర్గంలోని జర్నలిస్టులందరికీ హెల్త్‌కార్డు ప్రీమియం తామే చెల్లిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రకటించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో కలిసిన పాత్రికేయులతో వారు మాట్లాడుతూ పాత్రికేయుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారన్నారు. జర్నలిస్టుల కోసం పక్కాగృహాలు నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. ఎన్నో మానసిక ఒత్తిళ్లకు గురై పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గంలోని జర్నలిస్టుల పేర్లు తమకు అందజేస్తే ఒక్కొక్కరికి 1250 రూపాయలు ప్రకారం ప్రీమియం డబ్బులు చెల్లిస్తామన్నారు. గతంలో కూడా పలుమార్లు ప్రీమియం చెల్లించినట్లు మాజీ మంత్రి పల్లె గుర్తు చేశారు. ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు ఈ హెల్త్‌కార్డు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పుల్లయ్య, బాబు, మురళి, బసప్ప, గోపాల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ముందుకురావడం అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

జర్నలిస్టుల సంక్షేమం కోసం వెంకటేష్ రెడ్డి ముందుకు రావడం అభినందనీయమని పలువురు పాత్రికేయులు అన్నారు. రెడ్డి జేఏసీ అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి హిందూపురంలో వివిధ పత్రికలు, చానల్స్‌లో పని చేస్తున్న జర్నలిస్టు మిత్రులకు బుధవారం ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులకు పోస్టల్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) చేయించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేష్ రెడ్డి మాట్లాడుతు సమాజం కోసం ఎంతగానో కృషి చేస్తున్న జర్నలిస్టులు దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురైతే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గూరికాకూడదనే ఆలోచనతో జర్నలిస్టులకు పోస్టల్ ఇన్సూరెన్స్‌ను చేయించామన్నారు. ఈ ఇన్సూరెన్స్‌ను ఐదు సంవత్సరాల పాటు ప్రీమియం నగదును చెల్లిస్తానని అన్నారు. అనంతరం దాత వెంకటేష్ రెడ్డిని పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ మురళి తో పాటు డిఒపిఎల్ఐ నరసింహమూర్తి, డిజిఎస్‌బిపిఎంఎస్ నాగరాజు రావు, మౌలాలి, నాగమణి, హరి లింగేశ్వర్, సురేఖ, తేజస్విని, తిప్పేస్వామి, ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి ప్రశాంత్, గౌరవ అధ్యక్షులు ప్రకాష్, గౌరవ సలహాదారులు సురేష్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు షబ్బీర్, ఉపాధ్యక్షులు రమేష్, రమేష్, రాజేష్, చరణ్‌తో పాటు పాత్రికేయులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

గాండ్లపెంట, రెక్కమాను, మల్లి మీద పల్లి తదితర గ్రామాలలో ఆర్ఎంపిలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్సాకేంద్రాలను వైద్యాధికారి మహేశ్వర్ ప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే నిర్వహించాలన్నారు. సూదిమందు వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఫిరోజ్ ఖాన్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలకు తాఖీదు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని జిసిఆర్ కేరళ మోడల్ ప్రయివేటు పాఠశాలకు ఎంఇఒ కృష్ణనాయక్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనుమతి లేకుండా ఎనిమిదవ తరగతి ఇంగ్లీష్ మీడియం నడుపుతుండటంతో షోకాజ్ నోటీస్ అందజేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అంగన్వాడీలపై వేధింపులు ఆపాలి

సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల నిరసన


పుట్టపర్తిలో వినతిపత్రం అందజేత


ధర్మవరంలో వినతిపత్రం అందజేత


హిందూపురంలో వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్రంలో పార్టీలు మారినప్పుడల్లా అంగన్వాడి, ఆయాలను మార్చాలనడం భావ్యం కాదని పుట్టపర్తి సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు అన్నారు. అంగన్వాడి కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పుట్టపర్తి ఆర్డీవోకు పుట్టపర్తి సిడిపిఓ గీతాంజలి అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి సెక్టార్ లీడర్ సుజాత, మంజుల, భగవతి, వేదవతి, మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

తనకల్లు : అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఆంజనేయులును అరెస్టు చేయాలని సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఒంటెద్దు వేమన్న, రైతు సంఘం శివన్న, వివి. రమణ, అంగన్వాడీ భాగ్యమ్మ, రమాదేవి, మంజుల, రమణమ్మ, వెంకటమ్మ,తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : ఓడిసి మండల వీరప్ప గారి పల్లి అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్య పాల్పడడానికి కారకులైన అధికార పార్టీకి చెందిన ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల నాయకులు రాజగోపాల్, అంగన్వాడి జిల్లా కోశాధికారి శ్రీదేవి డిమాండ్ చేశారు. సోమందేపల్లి అంగన్వాడి సెక్టార్ ఆధ్వర్యంలో స్థానిక సిడిపిఒ కార్యాలయంలో సిడిపిఒ అనురాధకు, డిప్యూటీ తహశీల్దార్ గౌరీశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు నాగమణి, ప్రమీల, అరుణ, పద్మావతి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మినీ అంగన్వాడి కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సెక్టర్ లీడర్లు ధనలక్ష్మి, భాగ్యమ్మ, శశికళ, మాధవి పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు బావమ్మ, మాబున్నీసా, సుజాత, సిఐటియు మండల కో కన్వీనర్ బాబావలి, రాజురావు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అంగన్వాడీ కార్య కర్త పై వేధింపులకు పాల్పడిన ఆంజనేయులును అరెస్టు చేయలని అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం కదిరి తహశీల్దార్‌కి వినతి పత్రం సమర్పించారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, సుజాత, లక్ష్మీదేవి, పద్మావతి, భాగ్యమ్మ, మాధవి, సుమిత్ర. సిఐటియు నాయకులు జగన్మోహన్, ముస్తాక్, ఆంజనేయులు, ఫాజిల్, నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయతానికి కారణమైన ఆంజనేయులును వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు మండల తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రామకష్ణ అంగన్వాడీలు పద్మావతి, షర్మిలా రజియా, సుజాత ,ఫాతిమా, అక్కులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిని అరెస్టు చేయాలని సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, ప్రజానాట్యమండలి కె బాబు, సిపిఎం నాయకులు మధుసూదన్ రెడ్డి, అంగనవాడి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు అధ్యక్షురాలు రజియా, ఆవాజ్ కమిటీ సభ్యులు బాబ్జాన్, చాంద్ బాషా, రహీం, రఫీ, హాజీవ్, అలీ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఆంజనేయులును అరెస్టు చేయాలని సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆర్డీఓ కార్యాలయ అధికారిణి లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ అయూబ్ ఖాన్, సీనియర్ నాయకులు ఎస్ హెచ్ బాషా, ఎల్ అదినారాయణ, సిపిఎం పట్టణ కార్యదర్శిశేషంపల్లి మారుతి, నరసింహులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారణమైన ఆంజనేయులును అరెస్టు చేయాలని సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఐసిడిఎస్, తహశీల్దార్ కార్యలయాల వద్ద నాయకులు, అంగన్వాడీలు ఆందోళన చేపట్టి, ఐసిడిఎస్ సిడిపిఓ రెడ్డి రమణమ్మ, డిప్యూటి తహశీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, ప్రాజెక్టు అధ్యక్షురాలు శోభమ్మ, సెక్టర్ లీడర్స్ హిందూపురం శిరీష, వరలక్ష్మి, వాణి, శ్రీదేవి, ఉమా, లేపాక్షి, హిందూపురం, చిలమత్తూరు మండలాల వర్కర్లు పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి సన్మానం

లేపాక్షి : మండలం పరిధిలోని చోళ సముద్రం జడ్పీ హైస్కూల్లో 2023-24 సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లోఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని హిమబిందును బుధవారం సన్మానించారు. పది పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పాఠశాల విద్యార్థినికి చోళ సముద్రానికి చెందిన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ నారాయణస్వామి 10 వేల రూపాయల నగదును అందచేసి ఘనంగా సన్మానించారు. ఇలాగే ప్రతి సంవత్సరం పాఠశాల లో ఉత్తమ కనబరిచిన విద్యార్థులకు పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందచేస్తామన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

కర్నాటక సిఎంను కలిసిన బికె

పెనుకొండ : కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఢిల్లీలో హిందూపురం ఎంపీ బికె పార్థసారథి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎమ్‌కు ఎంపీ : పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర మంత్రి మహదేవప్ప, మాజీ మంత్రి రేవన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

రొద్దం : మండలంలోని పెద్దమంతూరు గ్రామంలో రైతు సాగు చేసిన పత్తిపంటను వ్యవసాయ అధికారులు బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన పూజారి వెంకప్ప అనే రైతు సాగు చేసిన పత్తిపంటను జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు పరిశీలించారు. పంటసాగు పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె. స్వయంప్రభ, మండల వ్యవసాయ అధికారి యం. నివేదిత, వ్యవసాయ సహాయకులు పి. యోగేష్, రైతులు పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

లేపాక్షి : మండలంలోని గౌరీగానిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అది నారాయణ బుధవారం రిటైర్డ్ అయ్యారు. దీంతో ఆయనను తోటి ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, ఎంఇఒలు నాగరాజు, కుళ్లాయప్ప, సల్మాన్ రాజ్, సిరివరం హై స్కూల్ హెడ్ మాస్టర్ రవి శంకర్, నాగ సాయినాథ్, లేపాక్షి రిటైర్డ్ శ్రీరాములు, యుటిఎఫ్ నాయకులు కొండారెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల పరిశీలన

కదిరి టౌన్ : పట్టణంలోని బాలుర పాఠశాల ఎదురుగా త్వరలో ప్రారంభం కానున్న అన్న క్యాంటీన్‌కు సంబంధించిన పనులను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి ,పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఖతాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

తలుపుల : మండలంలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో సాయి నికేతన్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో వైదేహి సూపర్ స్పెషాలిటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు పంపిణీ

కదిరి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పవన్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఎన్‌సిసి కోఆర్డినేటర్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బత్తలపల్లి : బత్తలపల్లిలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆలయానికి తనవంతుగా వైసీపీ యువ నాయకుడు పామాల్ల రమేష్ తనవంతుగా రూ. 10, 500 విరాళాన్ని అందజేశారు. బుధవారం బత్తలపల్లిలోని తన స్వగృహంలో తనను కలిసిన రజక సంఘం నాయకులకు గంగమ్మ దేవాలయం నిర్మాణానికి రూ. 10,500 రూపాయల విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు చాకలి నారాయణస్వామి, చాకలి నగేష్, చాకలి శీనా, సత్తెప్ప, మంజు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

పెనుకొండ : బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు బుధవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ డి ఎస్ వరకుమార్, ఎస్ఇ సంపత్ కుమార్‌కు బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక సభ్యులు వెంకటేశులు, హనుమంతు, బాబు ప్రసాద్, రవికుమార్, నాగరాజు, ఈశ్వర్, రామాంజనేయులు, కదిరప్ప, నరసింహులు, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

గాండ్లపెంట : మండలానికి చెందిన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తదితర పెంపకం దారులు గోకులం షెడ్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి చెన్నకేశవనాయక్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోకులం షెడ్ల ఏర్పాటుకు రైతులకు రాయితీ సాయం అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మండల రపజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసైన్డ్ భూ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

వ్యకాసం జిల్లా నాయకులు పెద్దన్న

ప్రజాశక్తి-సోమందేపల్లి

అసైన్డ్ భూచట్ట సవరణను ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుత గత ప్రభుత్వ పాలకులు అసైన్డ్ భూములకు భూ యాజమాన్యపు హక్కులు కల్పిస్తామని నమ్మబలికి అసైన్డ్ భూ చట్ట సవరణ ద్వారా జీవో నెంబర్ 596 ఉత్తర్వులతో అసైన్డ్ భూ అక్రమాలకు తెర లేపి భూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వం మోసాలను రాష్ట్ర ప్రజలకు శ్వేత పత్రాల ద్వారా విడుదల చేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం అన్యాక్రాంతమైన అసైన్డ్ భూముల మీద కూడా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో పెనుకొండ, హిందూపురం, చిలమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో వేలాది ఎకరాలు చేతులు మారాయన్నారు. వీటిని గుర్తించి తక్షణం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

మల్బరీ రైతులకు ఇన్సెంటివ్ చెల్లించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్


మాట్లాడుతున్న బడాసుబ్బిరెడ్డి

మల్బరీ రైతులకు చెల్లించాల్సిన రూ. 60 కోట్లు ఇన్సెంటివ్ వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబు మల్బరీ రైతులను ఆదుకోవాలని కోరారు. మల్బరీ రైతులకు ఇన్సెంటివ్ ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని పదేపదే కోరినా కాలయాపన చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి తక్షణమే రైతులకు రావలసిన ఇన్సెంటివ్ పంపిణీ చేస్తామని ప్రకటనను మడకశిరలో ప్రకటించాలని కోరారు. అలాగే రైతుల మోటర్లకు మీటర్లు పెట్టే విధానాన్ని ఉపసంహరించుకోవాన్నారు. ప్రకటించిన పెట్టుబడి సాయం 20వేల రూపాయలు రైతులకు వెంటనే ఇవ్వాలన్నారు. భూమి యాజమాన్యంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.

రెండు లారీలు ఢీ...

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- పెనుకొండ

రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. పెనుకొండ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. కర్నాటక రాష్ట్రం కోలార్ నుంచి చత్తీస్‌ఘఢ్‌కు టమోటాల లోడుతో వస్తున్న లారీ హైదరాబాదు వైపు నుంచి ఉల్లగడ్డలు లోడుతో వస్తున్న మరొక లారీ పెనుకొండ సమీపం వద్ద అదుపుతప్పి ఢీకొన్నాయి. దీంతో టమాటాల లోడు లారీ డ్రైవర్ శ్రీనివాసులు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే లారీ క్లీనర్ ముత్తప్ప గాయాలు అయ్యాయి. అదేవిధంగా ఉల్లగడ్డల లారీ డ్రైవర్ శీను, క్లీనర్ శ్రీరామ్ గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని శిరా-కొడికొండ చెక్‌పోస్టు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనున్న డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. గూళురుకు చెందిన చంద్ర, శంకర్ అనే యువకులు హిందూపురం వైపు నుండి బాగేపల్లి వైపు ద్విచక్రవాహనంలో వెళుతుండగా చిలమత్తూరు మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. వీరిని అంబులెన్స్ సహాయంతో బాగేపల్లి ఆసుపత్రి కి తరలించారు

అకౌంట్స్ విభాగం అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని అకౌంట్స్ విభాగంలో జరిగిన అవినీతిపై సమగ్రంగా విచారణ జరిపి, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని 8వ వార్డు కౌన్సిలర్ గిరీష్ కుమార్, పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన పురపాలక సంఘ అత్యవసర సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 36 అంశాలతో కూడిన అజెండాతో పాటు మూడు అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ఆమోదం కోసం కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశం ప్రారంభం అయిన వెంటనే కౌన్సిలర్ గిరీష్ కుమార్ అకౌంట్స్ విభాగంలో అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని, విచారణ పూర్తి అయ్యేవరకు కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు టిడిపి వైసిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ ఇప్పటికే విచారణ చేయాలని అధికారులకు కోరడం జరిగిందని, దీనిపై మరోసారి ఉన్నతాధికారులకు సమగ్ర విచారణ చేపట్టే విధంగా కోరుతామని చెప్పారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ డీఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-పెనుకొండ


డీఎస్పీ ఎ. శ్రీనివాసులు

పెనుకొండ డీఎస్పీ బాజీ జాన్ సైదా బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల ముగిసిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీల బదిలీలలో భాగంగా పెనుకొండ డీఎస్పీ బదిలీ అయ్యారు. నెల్లూరు ఎస్ బి,ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆర్ల శ్రీనివాసులను పెనుకొండకు రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డి.ఎస్.పి బాజీ జాన్ సైదా పోలీస్ హెడ్ క్వార్టర్ లో రిపోర్ట్ చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడికి బదిలీపై వస్తున్న ఆర్ల శ్రీనివాసులు గతంలో పెనుకొండ ఎస్ఐగా విధులు నిర్వర్తించారు.

కదిరి రోటరీ క్లబ్ అధ్యక్షులుగా నితిన్

ప్రజాశక్తి - కదిరి టౌన్



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

కదిరి రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా తాయి నితిన్ ఎన్నికయ్యారు.కదిరి పట్టణం లోని స్థానిక వైయస్సార్ నగర్లో గల బైరెడ్డి ఫంక్షన్ హాల్ నందు రోటరీ క్లబ్ కదిరి నూతన కార్యవర్గాన్ని ఇన్స్టాలేషన్ ఆఫీసర్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కదిరి పట్టణ సిఐ జి .వెంకటేశ్వర్లు , స్థానిక ప్రభుత్వ వైద్యశాల సీనియర్ వైద్యులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, రోటరీ క్లబ్ సభ్యులు మేడా ప్రభాకర్ హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులుగా తాయి నితిన్, కార్యదర్శిగా నామ నాగార్జున్, కోశాధికారిగా అభినయ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పచ్చి పులుసు రాఘవేంద్ర, శ్రీనివాస్ ప్రశాంత్, డాక్టర్ మదన్ కుమార్, శివ శంకర్, వాల్మీకి అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ బాబా ఫక్రుద్దీన్, కిషోర్ కుమార్ రెడ్డి, హర్షవర్ధన్, రంజిత్, పృథ్వీరాజ్, నామ రాఘవేంద్ర, మట్టా రాజీవ్, మహేశ్వర్ రెడ్డి, తాయి శ్రీనివాస్, తాహెర్ వలి, శ్రీనివాస్ కిరణ్, ప్రభాకర్, విజయానంద్ ప్రసాద్, బ్రహ్మచారి , డాక్టర్ ఇస్మాయిల్ ఆజాద్, సోమశేఖర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుక్కపట్నం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసి ప్రజలకు జవాబుదారీతనంగా ఉందామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే అధికారులు ప్రజలకు జవాబుదారి తనంగా ఉండాలని తెలిపారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, మాజీ సర్పంచి సాకే యశోద, వెంకట రాముడు, గంగాధర్, లావణ్య గౌడ, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులుచకార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

సిలబస్‌లో మార్పులతో విద్యార్థులకు నష్టం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పదవ తరగతి విద్యార్థులకు మారిన సిలబస్ తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి విమర్శించారు. యుటిఎఫ్ స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థుల టెస్టుబుక్‌లో ఉన్న కంటెంట్, పాఠాలు భవిష్యత్తులో విద్యార్థులకు ఏ మాత్రం ఉపయోగపడే విధంగా లేవని , దీని వల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఈ ఏడాది మారిన 10వ తరగతి సోషల్ టెస్టుబుక్లో 258 పేజీలుంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకు కేటాయించి రాష్ట్ర చరిత్రకు అత్యంత తక్కువ పేజీలు ఇచ్చారన్నారు. ఇవి విద్యార్థులకు ఎలా ఉపయోగపడతాయో చెప్పాలన్నారు. గత ఏడాది 9వతరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బందికరంగా ఉందని, ఉపాధ్యాయులకు కూడా అర్థం చేసుకోలేని విధంగా ఉందని అన్నారు. ఉత్తర భారతదేశం మాండలికాలు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులను, ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేసిందన్నారు. గతంలో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఈ ఏడాది 10వ తరగతి టెస్టుబుక్ అదే పద్ధతిలో ముద్రించారని విమర్శించారు. విద్యార్థులకు హిందీ బాష పట్ల ఆసక్తిని తగ్గించే ప్రక్రియను చేపట్టారనే అనుమానం వ్యక్తమవుతుందన్నారు. భౌతిక శాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం లాంటి పాఠాలు తొలగించడం అత్యంత దారుణమన్నారు. గణిత సబ్జెక్టులో భవిష్యత్తు పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా లేవన్నారు. ఇప్పటికైనా పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, అమరనారాయణరెడ్డి, రాంప్రసాద్, హరికృష్ణ, సాయిగణేశ్, రామాంజినేయులు, ఆదిశేషు, వెంకటకిశోర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ప్రభుత్వం అందించే వ్యవసాయ పరికరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలోని రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ భవన్లో రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగా పెడపల్లి పంచాయతీలోని 46 మంది ఎస్సీ కుటుంబాలకు చెందిన రైతులకు సుమారు రూ. 4.60 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాలను అందించామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నదే టిడిపి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన స్టేట్ ఎస్సీ సెల్ నాయకుడు రంగప్ప మాజీ మంత్రిని తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కాలనీలో సమావేశం నిర్వహించడం సబబు కాదని ప్రశ్నించారు. దానికి మాజీ మంత్రి కలగజేసుకొని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచి శ్రీరామ్‌నాయక్, శ్రీరామిరెడ్డి, పుల్లప్ప, బొమ్మయ్య, శివప్ప, కుళ్లాయప్ప, దళిత నాయకులు రంగప్ప, రైతులు ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రొద్దం

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్‌డిటి మహిళ విభాగం టీం లీడర్ ఆదినారాయణ అన్నారు. మండలంలోని తురకలాపట్నం స్థానిక జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డిటి,మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాల్య వివాహాలు అరికడదాం ఆడబిడ్డలను కాపాడుదాం" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెనుకొండ ప్రాజెక్ట్ మహిళా శిశు అభివృద్ధి పథక అధికారి శాంతలక్ష్మి, రొద్దం మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాతమ్మ, జెడ్పీ హెచ్ స్కూల్ హెచ్‌ఎం శివరాం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివయ్య, ఉపాధ్యాయులు అన్నపుర్నేశ్వరి, భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది గౌతమి, అంగన్వాడి కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాలలో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజా మన్ననలు పొందాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయకుమార్ పేర్కొన్నారు.బుధవారం మండలంలోని ఈదుల ముష్టురు గ్రామ సచివాలయంలో ఎంపీడీవో శివనాగప్రసాద్, ఇఒఆర్‌డి దివాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిన్న ముసలప్ప సర్పంచి గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోనుగుంట్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎంపీడీవో శివనాగప్రసాద్, ఇఒఆర్‌డి దివాకర్ మాట్లాడుతూ ఇప్పటివరకు సర్పంచిగా కొనసాగిన చెడిపోతుల గోపాల్ తన పదవికి రాజీనామా చేయడంతో ఉప సర్పంచిగా కొనసాగుతున్న చిన్న ముసలప్పకు సర్పంచిగా బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లాయర్ సూర్య ప్రకాష్ రావు, కరణం హేమంత్ కుమార్, తెలుగు రైతు నియోజవర్గ అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులుకాకర్ల సురేంద్ర నాయుడు, నెట్టెం రమణ,కిరణ్ కుమార్, జక్కంపూడి నాగభూషణ, సంఘాల సూరి,చల్లా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యత : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందనిరాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితపుస్తకాలు, బ్యాగులు అందజేసిందన్నారు. ఈకార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నరసింహమూర్తి, టిడిపి మండలకన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మాజీ జడ్పిటిసి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, మాజీ వైస్ సర్పంచి సుబ్రహ్మణ్యం, జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు,బ్యాగులు అందజేస్తున్న మంత్రి సవిత

పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ అంజయ్య పై మున్సిపల్ సిబ్బందితోపాటు సచివాలయ ఉద్యోగులు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పుట్టపర్తిలో ఉన్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య తమకు వద్దని అన్నారు. ఒంటెద్దు పోకడలతో ఆయన నిర్ణయాలు ఉన్నాయన్నారు. పుట్టపర్తి లో నెలకొన్న సమస్యలతో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ కమిషనర్ విఫలమయ్యారన్నారు. పుట్టపర్తికి దేశ విదేశాల నుంచి భక్తులు పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తుంటారని అలాంటి సమయంలో పారిశుధ్యం, డ్రయినేజీ, తాగునీరు సమస్యలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇకనైనా పుట్టపర్తి అభివృద్ధి గురించి ఆలోచించే కమిషనర్ ను నియమించాలని వారు కోరారు.